జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 26-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 765 పేజీలు: 4 వెల: రూ.7

# డిగ్రీ చదువుతూ.. చోరీలు



* ఏడు దొంగతనాల కేసుల్లో పట్టుబడిన యువకుడు
* వరుస బంగారం దొంగతనం కేసుల్లో విద్యార్థి అరెస్టు
* 16 తులాల బంగారం రికవరీ
* వివరాలు వెల్లడించిన కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని

ఇచ్ఛాపురం ఆగస్టు25 (వార్త): ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి చెడు అలవాట్లకు లోనైన డిగ్రీ చదువుతున్న ఓ 20 ఏళ్ల యువకుడు వరుసగా ఏడు కేసుల్లో దొంగతనానికి పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. ఇతని వద్ద నుండి పెద్ద ఎత్తున బంగారం రికవరీ చేశారు. కాశీబుగ్గ డీఎస్పి టి భవాని విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల డొంకూరులో జరిగిన ఓ దొంగతనం కేసులో 24 వేల రూపాయలు నగదు, ఒక బంగారం కాసు చోరీకి గురైనట్లు రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు అందింది. ఈ కేసు దర్యాప్తుల భాగంగా విచారణ చేస్తుండగా సోంపేట మండలం ఇసుకల పాలెం చెందిన వాసుపల్లి తాతారావు అనే 20 అనే యువకుడిని లొద్దపుట్టి జంక్షన్ వద్ద రూరల్ ఎస్సై జనార్దన్ రావు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ చెప్పారు .నిందితుడు బారువలో డిగ్రీ చదువుతున్నాడని చెప్పారు. ఇచ్ఛాపురం, కవిటి, బారువ తదితర ప్రాంతాల్లో ఏడు కేసుల్లో చోరీకి పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. సోంపేట నుండి బరంపురం వెళ్తుండగా ఇతను వద్దనుండి 16 తులాల పావు బంగారం రికవరీ చేయగా వాటి విలువ 28.43 లక్షల రూపాయలు ఉంటుందని, మరో 39 వేల రూపాయలు నగదును సీజ్ చేశామని చెప్పారు ఈ సమావేశంలో సీఐ ఎం.చిన్ననాయుడు, బారువ ఎస్ఐ కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

చెడు వ్యసనాలకు బానిసై కొందరు యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని కొందరు ఆన్‌లైన్ బెట్టింగులు ఆడుతూ సర్వస్వం కోల్పోతూ చివరికి దొంగతనాలకు, గంజాయికి తరలింపునకు పాల్పడుతూ భవిష్యత్ లేకుండా చేసుకుంటున్నారు. సోంపేట మండలానికి చెందిన ఓ విద్యార్థి అయితే ఏకంగా ఏడు చోరీలకు పాల్పడి పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యాడు. మరో మైనర్ బాలుడైతే ఏకంగా గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు.



## గంజాయితో ముగ్గురు యువకుల అరెస్టు

పలాస: ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. మరో 17 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నట్టు కాశీబుగ్గ డీఎస్పీ భవాని తెలిపారు. మంగళవారం మీడియా ముందు నిందితులను ప్రవేశ పెడుతూ వివరాలు వెల్లడించారు. వారి నుంచి 16 ప్యాకెట్లలో ఉన్న 32.590 కిలోల గంజాయితోపాటు మూడు స్మార్ట్‌ఫోన్లు, ఒక కీప్యాడ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. తమిళనాడుకు చెందిన సర్వసన్ పలని (22), భూపాలన్ ఎస్ (21), మాసన్ (22)తో 17 ఏళ్ల బాలుడికి పెయింటింగ్ పనులు చేసే సమయంలో పరిచయం ఏర్పడింది. అనంతరం వారు గంజాయికి బానిసయ్యారు. తమిళనాడు-ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో బాలాజీ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసేవారు. తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి సూచన మేరకు ఒడిశాలోని పర్లాకిమిడికి వెళ్లి అక్కడ పినోష్ కుమార్ ఆనంద్ వద్ద గంజాయి తీసుకురావడానికి అంగీకరించారు. ఇందుకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇస్తామని చెప్పడంతో వారు అంగీకరించారు. ఈ క్రమంలో పర్లాకిమిడి నుంచి రూ.80 వేలకు 32.590 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, 16 ప్యాకెట్లుగా మూడు బ్యాగుల్లో సర్దుకున్నారు. ప్రైవేటు బస్సులో కాశీబుగ్గకు చేరుకున్న నిందితులు.. అక్కడి నుంచి తమిళనాడు వెళ్లేందుకు పలాస రైల్వే స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా పోలీసులకు అనుమానం వచ్చి వారి బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. నిందితులపై మత్తుపదార్థాల రవాణా నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ దుర్గాప్రసాద్ వారిని అరెస్టు చేశారన్నారు.



# నదిని దాటుతూ రైతు గల్లంతు

* సైదాలపుట్టుగ వద్ద నదిలో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

ఇచ్ఛాపురం,ఆగస్టు 25 (వార్త): పొలం పనుల కోసం నది దాటుతున్న ఓ రైతు వరద ఉద్ధృతికి గల్లంతైన ఘటన ఇచ్ఛాపురం మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సైదాలపుట్టుగకు చెందిన గంగయ్య(50) ఇంటి వద్ద నుంచి బాహుదానదికి అవతల శాసనాం వద్ద ఉన్న పొలానికి బయలుదేరారు. ఈ క్రమంలో నదిని దాటేందుకు ప్రయత్నిస్తుండగా వరద నీటి ఉద్ధృతికి కొట్టుకుపోయారు. స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. గంగయ్యకు భార్య జానకమ్మ, వివాహితులైన ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, పట్టణ, గ్రామీణ ఎస్సైలు ముకుందరావు, జనార్దనరావు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.






## సరుబుజ్జిలి పీఎస్‌కు ఎస్ఐ..
# నియామకం ఎప్పుడు?

శ్రీకాకుళం, ఆగస్టు 25 (వార్త): సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌కు రెండు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన మహిళా ఎస్ఐకు శ్రీకాకుళం బదిలీ అయింది. అయితే ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం బూర్జ ఎస్ఐని అక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆమె వారానికి రెండుమూడుసార్లు సరుబుజ్జిలి వెళ్లి వస్తున్నారని భోగట్టా. ఇక్కడ రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఎస్సై కీలకపాత్ర పోషిస్తారు. అయితే రెండు నెలలుగా ఇక్కడ పోస్టు ఖాళీగా ఉండటంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌కు వెంటనే పూర్తిస్థాయి ఎస్సైని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అప్పలరాజు అనుచరుడి అరెస్ట్

* బైక్ ప్రమాదం కేసులో ఏ4గా అల్లు వెంకటరమణ
* సాక్ష్యాల తారుమారులో పాత్ర ఉందని అరెస్టు చేసిన పోలీసులు
* అరెస్ట్ అక్రమమంటూ వైసీపీ నేతల నిరసన

పలాస, ఆగస్టు 25 (వార్త): బైక్ ప్రమాదం కేసులో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సీదిరి అప్పలరాజు అనుచరుడు అల్లు వెంకటరమణను కాశీబుగ్గ పోలీసులు సోమవారం రాత్రి అదుపులో తీసుకున్నారు. ఇటీవల కాశీబుగ్గలో జరిగిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన ఘటనకు సంబంధించి నమోదైన కేసులో సాక్ష్యాలను తారుమారు చేయడంలో వెంకటరమణ పాత్ర ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ మేరకు ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.అ యితే అల్లు వెంకటరమణ అరెస్ట్‌ను వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అరెస్ట్ చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఇబ్బందులకు గురిచేసేందుకే ఆయన అనుచరులను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు ఈ నేపథ్యంలో మంగళవారం అల్లు వెంకటరమణను పరామర్శించేందుకు పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉంగ సాయి కృష్ణయాదవ్‌తో పాటు పలాస పట్టణ అధ్యక్షులు శిస్టు గోపి, నాయకులు సీదిరి త్రినాథ్ తదితరులు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. బైక్ ప్రమాదం కేసును అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తున్నారని వారు ఆరోపించారు. వెంకటరమణ అరెస్ట్‌ను చట్టపరంగా ఎదుర్కొంటామని, న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష నేతలపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ.. జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని వారు తెలిపారు.



## వంశధార కాలువలో గల్లంతైన ..

# యువకుడి మృతదేహం లభ్యం



- సారవకోట మండలంలో సోమవారం ప్రమాదం
- నరసన్నపేట ఎన్టీసీ కాలువలో తేలిన మృతదేహం
- గుర్తించి సారవకోట పోలీసులకు సమాచారం

**నరసన్నపేట, ఆగస్టు 25 (వార్త):** సారవకోట మండలం కిన్నెరవాడ సమీపంలోని వంశధార కాలువలో సోమవారం జరిగిన ప్రమాదంలో గల్లంతైన మెండ విశాల్‌కుమార్ మృతదేహం నరసన్నపేటలో లభ్యమైంది. మంగళవారం ఉదయం నరసన్నపేట పరిధిలోని ఎన్టీసీ కాలువలో ఓ మృతదేహం తేలుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై బి. గణేష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని గుర్తించి స్థానికుల సహాయంతో కాలువ ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం అది వంశధార కాలువ ప్రమాదంలో గల్లంతైన మెండ విశాల్‌కుమార్‌దేనని నిర్ధారించారు. ఈ విషయాన్ని వెంటనే సారవకోట పోలీసులకు తెలియజేశారు. మృతదేహం లభ్యమైన విషయం తెలుసుకున్న విశాల్‌కుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. సారవకోట పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

# కాలువలోకి దూకి డ్రైవర్‌ను కాపాడిన యువకుడు



- కాలువలో పడిన కారులో చిక్కుకున్న డ్రైవర్‌కు ప్రాణాపాయ స్థితిలో రక్షణ
- కారు అద్దాలు పగలగొట్టి నాగరాజును బయటకు తీసిన కూర్మాపు వెంకటరమణ

**సారవకోట, ఆగస్టు 25 (వార్త):** సారవకోట మండలం కిన్నెరవాడ వద్ద వంశధార కాలువలో కారు పడిపోయిన ఘటనలో అవలింగి గ్రామానికి చెందిన కూర్మాపు వెంకటరమణ చూపిన సాహసం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. కాలువలో కారు కొట్టుకుపోతుండగా ఏమాత్రం భయపడకుండా నీటిలోకి దూకి, కారు అద్దాలను పగలగొట్టి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వంశధార కాలువలో కారు ప్రమాదానికి గురైన సమయంలో అందులో డ్రైవర్ నాగరాజుతో పాటు మరో ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. కారు అదుపు తప్పి కాలువలో పడిపోవడంతో వేగంగా నీటిలో కొట్టుకుపోతూ మునిగిపోవడం ప్రారంభించింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న వెంకటరమణ ఈ ఘటనను గమనించారు. వెంటనే కాలువలోకి దూకిన ఆయన, నీటి ప్రవాహాన్ని లెక్కచేయకుండా కారును చేరుకున్నారు. అప్పటికే నీటిలో చిక్కుకున్న డ్రైవర్ నాగరాజును రక్షించేందుకు కారు అద్దాలను పగలగొట్టి బయటకు తీసుకువచ్చారు. అనంతరం కారులో ఉన్న మిగిలిన ఇద్దరు ప్రయాణికులను కూడా రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ, కారు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో వారిని కాపాడలేకపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. ప్రాణాలకు తెగించి డ్రైవర్‌ను రక్షించిన కూర్మాపు వెంకటరమణ ధైర్యసాహసాలను స్థానికులు అభినందిస్తున్నారు. ప్రమాద సమయంలో సమయస్ఫూర్తితో స్పందించి ఒకరి ప్రాణాలను కాపాడటం పట్ల ఆయనపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

## ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈవో

- విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచన
- పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా



**జలుమూరు, ఆగస్టు 25 (వార్త):** జలుమూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో బమ్మిడి మాధవరావు మంగళవారం ఉదయం సందర్శించారు. ప్రార్థన సమయంలో పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి పాఠశాలకు చేరుకోవడంతో పాటు విద్యార్థులు కూడా సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి, వారి పిల్లలు ప్రతిరోజూ సమయానికి పాఠశాలకు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఈవో మాధవరావు పేర్కొన్నారు.

## ఉపాధి హామీ రైతులకు

## 1,151 కొబ్బరి మొక్కల పంపిణీ

- జాబ్‌కార్డు ఉన్న సన్నకారు రైతులకు ఉచితంగా అందజేత
- ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన సాగుకు ప్రోత్సాహం



**నరసన్నపేట, ఆగస్టు 25 (వార్త):** ఉపాధి హామీ పథకంలో భాగంగా సన్నకారు రైతులకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఉద్యానవన సాగును ప్రోత్సహించే దిశగా నరసన్నపేట స్థానిక ఉపాధి కార్యాలయానికి మంగళవారం 1,151 కొబ్బరి మొక్కలు చేరాయని ఏపీవో కె. యుగంధర్ తెలిపారు. ఉద్యానవన శాఖ సహకారంతో ఉపాధి హామీ పథకం కింద ఈ కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సన్నకారు, చిన్న రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ముందుగా గుర్తించిన జాబ్‌కార్డులు కలిగిన అర్హులైన రైతులకు ఈ మొక్కలను ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. కొబ్బరి సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయం సమకూరే అవకాశముందని, మొక్కలను అందుకున్న రైతులు సరైన పద్ధతుల్లో నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు బాలసుబ్రమణ్యం, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 31న వైసీపీ కార్యాలయం ప్రారంభం



**శ్రీకాకుళం, ఆగస్టు 25 (వార్త):** శ్రీకాకుళం టౌన్ హాల్‌లో ఈ నెల 31వ తేదీనజరగనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై నియోజకవర్గ నాయకులతో యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు సమావేశమయ్యారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కార్యక్రమ ఏర్పాట్లు, నాయకులు , కార్యకర్తల భాగస్వామ్యంపై చర్చించారు. ఈ సందర్భంగా ధర్మాన రామ్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ, 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ ఎంత కష్టపడ్డారో, అదే స్ఫూర్తితో 2029లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చే కార్యక్రమమని, ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో శ్రీకాకుళం నియోజకవర్గ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు, యువత పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా నరేష్

**శ్రీకాకుళం, ఆగస్టు 25 (వార్త):** జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా డాక్టర్ ఈవీ నరేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గత నెల 13న జిల్లాకు డీఎంహెచ్ఓగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. పలు కారణాల వల్ల ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకోలేకపోయారు. ఎట్టకేలకు డీఎంహెచ్ఓగా నరేష్‌కుమార్ సోమవారం విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా జిల్లాలో వైద్యారోగ్యశాఖకు చెందిన కీలక అధికారులు, వైద్యులు, ఇతర విభాగాధికారులు ఆయనకు స్వాగతం పలికారు. కోవిడ్ సమయంలో జిల్లా నోడల్ అధికారిగా, సీతంపేట ఐటీడీఏ పరిధిలోనూ వైద్యాధికారిగా ఆయన విధులు నిర్వహించారు.




# టెట్‌లో మినహాయింపులివ్వాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్

**శ్రీకాకుళం, ఆగస్టు 25 (వార్త):** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రభుత్వము నిర్వహించదల్చుకున్న స్పెషల్ టెట్ నోటిఫికేషన్ కు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాలలో ఏపీటీఎఫ్ ప్రాతినిధ్యం చేసిన మినహాయింపులు లేకపోవడం సరైనది కాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం.భుజంగరావు, బి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ఖండించారు. స్పెషల్ టెట్‌లో డిపార్ట్మెంటల్ పరీక్షలో ఏ విధంగా అయితే అన్ని సామాజిక వర్గాలకు ఉన్న అర్హత మార్కులు 40% ఉంచాలని, ఏ సబ్జెక్ట్ టీచర్ కు ఆ సబ్జెక్టుకు సంబంధించిన సిలబస్ ప్రకారము ప్రశ్నపత్రాల్లో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. కానీ ప్రత్యేకమైన టెట్‌లో ఎటువంటి మినహాయింపులు లేకుండా నోటిఫికేషన్ మార్గదర్శకాలను జారీ చేయడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# అండగా నిలుస్తా

- అర్ధరాత్రైనా సమస్య తెలుసుకుంటా
- పరిష్కారమయ్యే వరకు నిద్రపోను
- పలాస నియోజకవర్గ ప్రజలే నా సర్వస్వం
- కష్టాల్లో తోడుగా ఉంటా

**పముఖ సామాజిక కార్యకర్త**

**మన్యాల శ్రీనివాస్ యాదవ్**

**పలాస, ఆగస్టు 25 (వార్త):** పేదరికంలో ఉన్నప్పటికీ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ తమ కష్టాలను ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి అండగా నిలుస్తానని పలాస నియోజకవర్గానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త మన్యాల శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. మంగళవారం కుటుంబ పరిస్థితిని కృష్ణ తన దృష్టికి తీసుకువచ్చారని, విషయం తెలుసుకున్న వెంటనే ఆ కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు మన్యాల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా పలాస నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఆయన భావోద్వేగంగా స్పందిస్తూ. “పలాస నియోజకవర్గంలోని ప్రతి కుటుంబ సభ్యుడికి మనస్ఫూర్తిగా నమస్కరిస్తున్నాను. పేదరికంలో ఉన్నా ఆత్మగౌరవంతో జీవించే వారు తమ కష్టాలను పదేపదే చెప్పుకోవడానికి ఇష్టపడరని తెలిపారు. అలాంటి వారి బాధను అర్థం చేసుకోవడం మన బాధ్యతని, కృష్ణ ఈ కుటుంబ పరిస్థితిని నా దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. వారికి అండగా ఉంటాన అని తెలిపారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా, వాటి పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. “నా కట్టె కాలేంత వరకు పలాస నియోజకవర్గంలోని పేద ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అర్ధరాత్రి అయినా మీ సమస్య నా దృష్టికి వస్తే తెలుసుకుంటానని,సమస్య పరిష్కారమయ్యే వరకు నిద్రపోను” అని హామీ ఇచ్చారు. పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత, ఆర్థిక సహాయం వంటి అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం అందించాల్సిన బాధ్యత ప్రజా జీవితంలో ఉన్నవారిపై ఉందన్నారు. ఆత్మగౌరవంతో జీవించే కుటుంబాలు తమ పరిస్థితిని బహిరంగంగా చెప్పుకోలేని సందర్భాల్లో వారి బాధను గుర్తించి ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. “మీరే నా సర్వస్వం. మీ కోసం ఎంత దూరమైనా వెళ్తానని, ఎన్ని కష్టాలైనా పడతానని, మిమ్మల్ని మాత్రం కష్టపెట్టను” అంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు. అధికార, రాజకీయ పరిమితులకు అతీతంగా ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పనిచేస్తానని తెలిపారు. పలాస నియోజకవర్గంలోని పేదలు, బలహీనవర్గాలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అందుబాటులో ఉండటమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో స్పందించడం, సమస్య తీవ్రతను అర్థం చేసుకోవడం, పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. “అందరూ బాగుండాలి.. అందులో మనం ఉండాలి” అనే సందేశంతో ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని తెలిపారు. ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత హామీగా మాత్రమే కాకుండా, పేద ప్రజలకు అండగా నిలవాలనే సామాజిక బాధ్యతను మరింత విస్తరిస్తానని తెలిపారు.



## పంజాబ్‌లో రైతు మహాసభలను జయప్రదం చేయాలి

-కరపత్రాలు ఆవిష్కరించిన కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ రామారావు



**పలాస, ఆగస్టు 25 (వార్త):** పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో సెప్టెంబరు 20, 21 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ మహాసభ 5వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం పలాస-కాశీబుగ్గలోని కోసంగిపురం శ్రమజీవుల సామాజిక భవనం ఆవరణలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిల రామారావు మాట్లాడుతూ దేశంలో రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. రైతుల భూములను బలవంతంగా సేకరించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందిస్తున్నారని విమర్శించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలు వంటి అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని రైతులు ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా గతంలో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులు పోరాటం చేశారని గుర్తుచేశారు. రైతే దేశానికి వెన్నెముక అని పాలకులు చెబుతున్నప్పటికీ, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉందని, సాగునీటి కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం ఆర్థికంగా నష్టపోతోందన్నారు. రైతుల సమస్యలు, వ్యవసాయ రంగంలో నెలకొన్న పరిస్థితులపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు పంజాబ్‌లో నిర్వహించనున్న 5వ అఖిల భారత కిసాన్ మహాసభలను విజయవంతం చేసేందుకు సహకరించాలని మద్దిల రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కిసాన్ మహాసభ నాయకులు పాల్గొన్నారు.

## పలాస పట్టణ ప్రజల

# దాహార్తి తీర్చడమే లక్ష్యం

- రూ.120 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు



**పలాస, ఆగస్టు 25 (వార్త):** పట్టణ ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యమని రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం రూ.120 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును చేపట్టిందని రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ వెల్లడించారు. మంగళవారం సూదికొండ ప్రాంతంలో జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఏళ్లుగా తాగునీటి సమస్య కొనసాగుతున్నా గత పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. నీటి కోసం మహిళలు, పురుషులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో రూ.120 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు మంజూరై పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. హామీలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా పనులను చేపడుతున్న కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని కార్పొరేషన్ స్థాయిలో అభివృద్ధి చేసి సుందర నగరంగా తీర్చిదిద్దే సామర్థ్యం ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. తాగునీటి ప్రాజెక్టు పూర్తయిన అనంతరం మున్సిపాలిటీలోని ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సవర రాంబాబు, అంబటి కృష్ణమూర్తి, బద్రి గోపాలరావు, గురిటి సూర్యనారాయణరావు, దడియాల నరసింహులు, బాడాడ ఉమాకాంత్, సైని వల్లభ నారాయణ, జోగ తిరుపతిరావు, పిట్ట రవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

### ఉద్దానాన్ని కాపాడేందుకు..
# సెప్టెంబరు 8న కళ్లకు గంతలతో నిరసన



**పలాస, ఆగస్టు 25 (వార్త):** ఉద్దాన ప్రాంతాన్ని విధ్వంసం చేసే కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 8న అన్ని గ్రామాల్లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపునిచ్చింది. కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ జిల్లా నాయకుడు మద్దిలి రామారావు, సీపీఎం నాయకుడు కొనారి మోహన్‌రావు మాట్లాడుతూ.. తమిళనాడులోని పెరంబూర్‌లో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా రెండేళ్లుగా ప్రజలు పోరాడుతున్నారని తెలిపారు. పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న కారణంతో అక్కడి ఎయిర్‌పోర్ట్‌ను రద్దు చేసినట్లు పేర్కొంటూ, ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గుణపాఠం కావాలని అన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో ఉద్దాన ప్రజల భూములు, ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే హక్కు ఎవరిచ్చారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడిబోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దానాన్ని విధ్వంసం చేసే చర్యలకు పాల్పడటం ప్రజలకు వెన్నుపోటు పొడవడమేనని విమర్శించారు. ఏకకాలంలో నాలుగు పంటలు పండే ఉద్దానం ప్రకృతి వైపరీత్యాలు, సునామీల నుంచి శ్రీకాకుళం జిల్లాకు రక్షణగా నిలుస్తోందని అన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ కోసం వేలాది ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటే రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మూడుసార్లు ఎంపీగా, ఒకసారి కేంద్ర మంత్రిగా పనిచేసిన రామ్మోహన్‌నాయుడు శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి చేసిన కృషిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాకరపల్లి వద్ద థర్మల్ పవర్ ప్లాంట్ కోసం సుమారు 2,020 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్న సందర్భంలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ.. అప్పట్లో జరిగిన ప్రాణనష్టానికి, నిర్వాసితుల సమస్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. ఎన్ని ఉద్యోగాలు కల్పించారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను ఎన్నాళ్లూ మోసం చేయలేరని, ప్రజలు చైతన్యంతో తిప్పికొడతారని నాయకులు అన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో భూముల జోలికి వస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు పి.దానేసు, జనశక్తి నాయకుడు కోనేరు రమేష్, ఏపీ రైతు సంఘం నాయకులు టి.అజయ్‌కుమార్, ఎంపల్ల కామేశ్వరరావు, వామపక్ష నాయకులు ఎన్.గణపతి, పి.వైకుంఠరావు, జి.బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, పి.నాగేశ్వరరావు, సీహెచ్.రవి, పౌరహక్కుల నాయకులు పి.జోగారావు, పోరాట కమిటీ నాయకులు బత్తిని లక్ష్మణరావు, గుంటు లోకనాథం, నల్ల పరుశురాం, పొట్టి ధర్మారావు, గుంటు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు కృష్ణన్‌కు డాక్టరేట్



**సోంపేట, ఆగస్టు 25 (వార్త) :** సోంపేట లో గల ఏపీ మోడల్ స్కూల్లో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న వి బి ఆర్ కృష్ణన్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసేందుకు ఎంపిక చేసింది. ఈ మేరకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ సైన్స్ అధ్యాపకునిగా పనిచేస్తూ కెమిస్ట్రీ విభాగంలో ఒక ప్రత్యేకమైన అంశంలో రీసెర్చ్ చేపట్టి విజయవంతంగా పూర్తి చేసిన కృష్ణన్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. సీనియర్ ఆధ్యాపకునిగా ఒకవైపు విద్యార్థుల కోసం నిరంతరం కృషి చేస్తూ మరోవైపు ఉన్నత విద్య సాధనలో నిమగ్నమై సైన్సు కు సంబంధించి రీసెర్చ్ కొనసాగిస్తూ విజయవంతంగా పూర్తి చేసినందుకు ఇటువంటి అవార్డు రావడం పట్ల ప్రిన్సిపాల్ వర్మ ఎంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మోడల్ స్కూల్ అభివృద్ధి కమిటీ తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు కృష్ణన్ ను అభినందించారు.

## ఘనంగా మంగళ గౌరీ వ్రతాలు



**ఇచ్ఛాపురం ఆగస్టు 25 (వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం లో శ్రావణ మంగళవారం సందర్భంగా సామూహిక మంగళగౌరి వ్రతము లు అత్యంత ఘనంగా జరిగాయి. వందల సంఖ్యలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. శ్రీనివాసుల నర్సింహ మూర్తి పౌరహిత్యం లో జరిగిన కార్యక్రమం లో ఆలయ అభివృద్ధి కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా లక్కీడిప్ నిర్వహించి విజేతలకు పట్టుచీరలు బహుకరించారు.

### పేద విద్యార్థులకు అండగా
## రాజపురం హైస్కూల్ ఉపాధ్యాయులు

**కవిటి, ఆగస్టు 25 (వార్త):** రాజపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు నిరుపేద బాలికలు అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆ కుటుంబానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాం ప్రసాద్ పాడితోపాటు ఉపాధ్యాయులు అండగా నిలిచారు. పేదరికం చదువుకు అడ్డు కాకూడదన్న ఆలోచనతో వారి పట్ల ఉపాధ్యాయులు పెద్ద మనసుతో సహాయానికి చొరవ చూపారు. పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని రేష్మ, ఆరో తరగతి విద్యార్థిని అఖిల తండ్రి చిన్న వయసులోనే కిడ్నీ వ్యాధి బారినపడి ఇటీవల మృతి చెందారు. ఇటువంటి పరిస్థితుల్లో నలుగురు కుమార్తెలు కలిగిన ఆ కుటుంబానికి సరైన చేదోడు వాదోడు లేక తీవ్ర సమస్యలతో సతమతమవుతున్న పరిస్థితిని ఉపాధ్యాయులు గుర్తించారు. ఇటువంటి నిరుపేద కుటుంబానికి సరైన సమయంలో ఆసరా ఇవ్వాలన్న సదాలోచనతో ప్రధానోపాధ్యాయుడు తో పాటు ఉపాధ్యాయులు కలిసి 20 వేల రూపాయల నగదు సహాయాన్ని మంగళవారం బాధిత కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. అత్యంత నిరుపేద కుటుంబం పట్ల తమ మానవత్వాన్ని ఉపాధ్యాయులు చాటుకున్నారు. ఈ సందర్భంగా బాలికల స్వగ్రామమైన తొత్తిడి పుట్టుగ గ్రామస్తులు ఉపాధ్యాయులను ఎంతో అభినందించారు. ఇటువంటి కుటుంబానికి ఈ సమాజం మరింత అండగా నిలవాలని గ్రామస్తులు కోరారు. అలాగే బాలికల చదువులకు తమ వంతు సహాయం అందిస్తామని ప్రధానోపాధ్యాయుడు శివరాం పాడి పేర్కొన్నారు.





### సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై
# రైతులకు అవగాహన

- కేలవలస రైతు సేవా కేంద్రంలో 'ఆత్మ' పథకం ఆధ్వర్యంలో శిక్షణ
- అధిక యూరియా వాడకంతో అనర్థాలు, సేంద్రియ వ్యవసాయంపై వివరణ
- రైతులు ఫార్మర్ ఐడీ, పంటల బీమా తప్పనిసరిగా చేసుకోవాలని సూచన

**సారవకోట, ఆగస్టు 25 (వార్త):** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకంలో భాగంగా సారవకోట మండలం కేలవలస రైతు సేవా కేంద్రంలో రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపుపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వరి పంటలో సస్యరక్షణ, ఎరువులు, నీటి యాజమాన్యం, నేల ఆరోగ్యం వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఆత్మ పథక సంచాలకులు కె. జగన్మోహనరావు మాట్లాడుతూ వరి పంటలో సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు అందించారు. పంట దిగుబడి పెంచాలనే ఉద్దేశంతో అధికంగా యూరియా వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని మోతాదుకు పరిమితం చేస్తూ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నరసన్నపేట సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్.వి. మధు మాట్లాడుతూ ఈ ఏడాది ఎలినినో ప్రభావం ఉన్న నేపథ్యంలో వరి పంటకు ఎరువులను సరైన మోతాదులో, సరైన సమయంలో వినియోగించాలని రైతులకు సూచించారు. పంటల బీమా ప్రతి రైతు తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు. అలాగే ప్రతి రైతు ఫార్మర్ ఐడీని నమోదు చేసుకోవాలని, భవిష్యత్తులో పంట కొనుగోలు ప్రక్రియలో ఫార్మర్ ఐడీకి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి. ఉదయ్‌బాబు రైతులకు వివిధ రకాల పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి వివరించారు. నేల సారాన్ని, ఆరోగ్యాన్ని కాపాడడంలో సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువుల ప్రాధాన్యతను వివరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకుని, అవసరమైన మోతాదుకు మించి వాటిని ఉపయోగించరాదని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. క్షేత్రస్థాయిలో వరి పంటను సందర్శించి పంట పరిస్థితులు, సాగు పద్ధతులపై రైతులకు అధికారులు వివరించారు. కార్యక్రమంలో సారవకోట మండల వ్యవసాయ అధికారి కె.చ. వెంకటరావు, ఏఈవో కాంతయ్య, వీఏఏ పి. రాజశేఖర్, మాజీ సర్పంచి చిన్నాల సింహాచలం, రావాడ చెంచయ్య, చిన్నాల అప్పన్న, చింత లక్ష్మణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కొబ్బరి మొక్కల పంపిణీ

- 26 గ్రామ పంచాయతీల్లో 54 మంది రైతులకు 1,175 కొబ్బరి మొక్కలు
- 35 ఎకరాల్లో ఉద్యానవన సాగుకు ప్రోత్సాహం
- సన్నకారు, చిన్న రైతులకు దీర్ఘకాలిక ఆదాయమే లక్ష్యం

**జలుమూరు, ఆగస్టు 25 (వార్త):** ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సన్నకారు, చిన్న రైతులకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించే దిశగా జలుమూరు మండలంలో కొబ్బరి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జలుమూరు స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో 54 మంది అర్హులైన రైతులకు 35 ఎకరాల విస్తీర్ణానికి గాను మొత్తం 1,175 కొబ్బరి మొక్కలను అందజేశారు. ఉద్యానవన శాఖ సహకారంతో ఉపాధి హామీ పథకం కింద ఈ మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఏపీవో తెలిపారు. ముందుగా గుర్తించిన జాబ్‌కార్డులు కలిగిన అర్హులైన రైతులకు మొక్కలను ఉచితంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటల సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కొబ్బరి సాగు రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయాన్ని అందించే అవకాశముందని యుగంధర్ తెలిపారు. మొక్కలను అందుకున్న రైతులు వాటిని నిర్ణీత పద్ధతుల్లో నాటడంతో పాటు ప్రారంభ దశ నుంచే సరైన సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి నిర్వహణ, మొక్కల చుట్టూ పరిశుభ్రత, సకాలంలో సంరక్షణ వంటి అంశాలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కేవలం కూలీ ఉపాధికే పరిమితం చేయకుండా గ్రామీణ రైతులకు స్థిరమైన ఆర్థిక వనరులు సమకూరేలా ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### హైవేపై ఆటో-లారీ ఢీ..
## ఇద్దరికి తీవ్ర గాయాలు

- జమ్మూ జంక్షన్ సమీపంలో మంగళవారం ఉదయం ప్రమాదం
- వెనుక నుంచి లారీని ఢీకొట్టిన ఆటో
- గాయపడిన ఇద్దరిని రిమ్స్‌కు తరలించిన పోలీసులు



**నరసన్నపేట, ఆగస్టు 25 (వార్త):** నరసన్నపేట జమ్మూ జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళుతున్న ఆటో, ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రవణ్‌కుమార్, వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న నరసన్నపేట పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎస్సై గణేష్ అంబులెన్స్‌కు సమాచారం అందించగా, గాయపడిన ఇద్దరినీ శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



## గంగివలసలో పల్లె నిద్ర

- ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసుల కార్యక్రమం
- ఎన్నికల సమయంలో ప్రశాంత వాతావరణం కొనసాగించాలని ఎస్సై విజ్ఞప్తి
- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచన



**పోలాకి, ఆగస్టు 25 (వార్త):** గంగివలస గ్రామంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి గ్రామంలో బస చేసిన పోలీసులు స్థానికులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో గ్రామంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, సంయమనంతో వ్యవహరించాలని ఎస్సై రంజిత్ సూచించారు. ఎలాంటి వదంతులను నమ్మకుండా, ఇతరులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించకుండా ఉండాలని కోరారు. గ్రామంలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం, పోలీసులపై ప్రజలకు మరింత నమ్మకం కల్పించడమే పల్లె నిద్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, అవసరమైన చర్యల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### 31 లోగా మిషన్ వాత్సల్య పథకానికి
## దరఖాస్తు చేసుకోవాలి

**ఇచ్ఛాపురం ఆగస్టు 25 (వార్త):** ఆర్థిక సంవత్సరానికి అర్హులైన లబ్ధిదారులనుండి మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులను ఈ నెల 31 లోగా అందజేయాలని ఐ సి డి ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.రాజేశ్వరి చెప్పారు. తల్లి తండ్రులు లేని అనాథ చిన్నారులు తండ్రి కోల్పోయిన నిరుపేద చిన్నారులు కి కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పారు.అంగన్ వాడీ కేంద్రంలో లేదా కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తులు ను స్వీకరించి, సదరు దరఖాస్తులపై మహిళా పోలీస్ మరియు అంగన్వాడి కార్యకర్తలచే గృహభ్యసన నివేదిక తయారు చేయించి, 31నాటికి దరఖాస్తులు మరియు గృహభ్యాస నివేదికలతో పిడి కార్యాలయానికి అందజేయాలని కోరారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

**-పార్టీ శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం**

**- జిల్లా నేతలతో తాడేపల్లిలో భేటీ**

**ఇచ్ఛాపురం ఆగస్టు 25(వార్త):** స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు వైస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దిశా నిర్దేశం చేశారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే కచ్చితంగా కూటమి వ్యతిరేక ఓటుతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం వైయస్ జగన్ స్పష్టీకరణ చేశారన్నారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో సమావేశం నిర్వహించారని తెలిపారు.

స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నందున, బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాలని సూచించారని చెప్పారు. అప్పుడే మిగి లిన ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ, బలం లాభిస్తుందన్నారు. ఎక్కడా ఏకగ్రీవ ఎన్నికలు జరగకూడదని పార్టీ పోటీ చేయాలని, వెన్నుపోటు పార్టీ, కూటమి రెండేళ్ల పాలనలో అన్నీ వైఫల్యాలే అన్నారు. ఈ ప్రభుత్వంతో తన 5 ఏళ్ల పాలనను పోల్చి చూస్తున్నారన్నారు. దీనిపై ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ చర్చ జరుగుతోందని, అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా బలపడిందని వైయస్ జగన్ వెల్లడించారన్నారు.



స్థానిక ఎన్నికలకు వైయస్సార్‌సీపీ పక్కా వ్యూహంతో, ప్రతి నియోజకవర్గంలో లీగల్‌సెల్, మీడియాసెల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై చురుకైన పాత్ర పోషించాలని సూచించారని తెలిపారు. ప్రతి ఇంటా ప్రచార కార్యక్రమం నిర్వహించి, ప్రభుత్వ వైఫల్యాలు వివరించాలన్నారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రచారం చేసి, బలమైన అభ్యర్థి పోటీలో నిలిపి, అందరితో మమేకమై, ఎక్కడా అహంకార ధోరణి (ఇగో) లేకుండా పని చేయాలని వైయస్ జగన్ దిశా నిర్దేశం చేశారని శ్యామ్ తెలిపారు.



## పశువుల పెంపకంలో
# సరైన జాగ్రత్త తీసుకోవాలి

**- రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు పై శిక్షణ**

**- ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికృష్ణ**



**మెళియాపుట్టి, ఆగస్టు 25 (వార్త):** పశువుల పెంపకంలో పశు పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ రవికృష్ణ అన్నారు. మెళియాపుట్టి మండల పరిధిలో గల రంగడుఘాటి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వారి ఆధ్వర్యంలో రైతులకు పూర్వ అభ్యాసం గుర్తింపు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నాడు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ రవికృష్ణ, మాట్లాడుతూ పశువుల పెంపకందారులు పశువులకు పశు వైద్యధికారుల సూచనలు సలహాలు పాటించి సరైన సమయంలో టీకాలు వేయించలని, పశుగ్రాసం పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని, వ్యవసాయంతో పాటుగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రతి ఒక్క రైతు కూడా తోడ్పాటుగా ఉండాలని రైతులకు పలు సలహాలు సూచనలు తెలియజేశారు.

పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు వై. శారద మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ఆచరిస్తున్న పద్ధతులను తెలియజేస్తూనే ప్రస్తుత పరిస్థితుల్లో ఏలినినో ప్రభావం ఉన్నందువలన రైతులందరూ ఆగస్టు 31వ తేదీ లోపల పంటల బీమా కచ్చితంగా నమోదు చేసుకోవాలని, అలాగే రైతుల పంట మార్పిడి విధానం వైపు మొగ్గు చూపాలని ముఖ్యంగా ఆరుతడి పంటలు పండించే దిశగా ఆలోచన చేసుకోవాలని వర్షాధార భూములలో నీటి సదుపాయం తక్కువ ఉన్నచోట వరి పంట పండించరాదని వరికి బదులుగా ఆరుతడి పంటలైన అపరాలు, రాగి మొదలైన పంటలు పండించాలన్నారు. అనేక విషయాలు రైతులకు సూచనలు సలహాలు అందించారు. అనంతరం అభ్యుదయ రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ఎస్. దానకర్ణుడు, కూటమి నాయకులు, జాడుపల్లి ఎంపీటీసీ ప్రతినిధి కదంబల పైడిరాజు, వ్యవసాయ సహాయకులు పుష్ప పల్లవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అభ్యుదయ రైతులు పాపారావు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 27న విద్యుత్ అంతరాయం

**ఇచ్ఛాపురం ఆగస్టు 25 (వార్త):** ఈ నెల 27 గురువారం పట్టణ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పలాస ఎలక్ట్రికల్ ఈ ఈ జి. యజ్ఞేస్వరరావు చెప్పారు.గొల్ల వీధి ఫకీరు పేట వి కే పేట,ఏరియా లో ఉదయం 9 నుండి 4 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు.

## మాధవ్‌తో విశ్వకర్మ ప్రతినిధుల భేటీ



**పలాస, ఆగస్టు 25 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను మంగళవారం విశ్వకర్మ సమాజ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సమాజానికి చెందిన ప్రతినిధులు' బిజెపి జిల్లా మోర్చా అధ్యక్షుడు లక్కోజి ధర్మారావు భగవాన్ విశ్వకర్మ చిత్రపటాన్ని ఆయనకు అందజేసి సత్కరించారు. భారతీయ సంస్కృతిలో శిల్పకళ, నిర్మాణ రంగం, చేతివృత్తులకు ఆద్యదైవంగా భావించే భగవాన్ విశ్వకర్మ ఆశీస్సులతో సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ ఈ చిత్రపటాన్ని అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వకర్మ సమాజానికి సంబంధించిన సమస్యలు, సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపు, సంప్రదాయ వృత్తులకు ప్రోత్సాహం వంటి అంశాలపై కూడా ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు తెలిసింది. పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ విశ్వకర్మ సమాజం దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. శిల్పులు, వడ్రంగులు, కమ్మర్లు, స్వర్ణకారులు తదితర చేతివృత్తుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. సమాజ అభ్యున్నతికి అవసరమైన సూచనలను పార్టీ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం విశ్వకర్మ' వంటి పథకాల ద్వారా సంప్రదాయ వృత్తిదారులకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందుతున్న నేపథ్యంలో, విశ్వకర్మ వర్గాల సాధికారతకు మరింత ప్రాధాన్యం లభిస్తోందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర స్థాయిలో సమాజ అభివృద్ధికి బీజేపీ నాయకత్వం సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. మర్యాదపూర్వక వాతావరణంలో జరిగిన ఈ భేటీ విశ్వకర్మ సమాజ ప్రతినిధులు, బీజేపీ నాయకత్వం మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా సాగిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్.. ఒకరి మృతి

**- మడపాంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదం**

**- చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేలోపే మృతి**

**- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**నరసన్నపేట, ఆగస్టు 25 (వార్త):** నరసన్నపేట మండలం మడపాం గ్రామంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. మండలంలోని చేనులవలస గ్రామానికి చెందిన సరిపల్లి రామచంద్రరావు (35) మడపాంలోని ఓ కంపెనీలో వెల్డింగ్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. పనుల్లో నిమగ్నమైన సమయంలో అనుకోకుండా విద్యుత్ షాక్‌కు గురికావడంతో రామచంద్రరావు అక్కడికక్కడే అపస్మారక స్థితికి చేరుకున్నట్లు సమాచారం. వెంటనే తోటి కార్మికులు, స్థానికులు స్పందించి ఆయనను చికిత్స నిమిత్తం నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో చేనులవలసతో పాటు మడపాం ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెల్డింగ్ పనులు, విద్యుత్ పరికరాల వినియోగంలో తగిన భద్రతా చర్యలు పాటించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

## ఆటో బోల్తా.. ఇద్దరు మహిళలకు గాయాలు

**మెళియాపుట్టి, ఆగస్టు 25 (వార్త):** ఆటో బోల్తా పడి ఇద్దరు మహిళలకు గాయాలు అయిన సంఘటన మెలియాపుట్టి మండలం పట్టుకుని గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో పట్టుపురం సమీపంలో మంగళవారం రాత్రి ఒడిశా రాష్ట్రం గారబంద గ్రామానికి చెందిన అల్లుబాబురావు మద్యం సేవించి ఆటో నడుపుతుండగా అదుపుతప్పి బోల్తాపడినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఒడిశా ప్రాంతం నీలాపురం గ్రామానికి చెందిన కుడితిరి సుజాత, ఇంగ్లీష్‌పేట గ్రామానికి చెందిన కొల్లి ప్రభావతిలకు గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే పరిసర ప్రాంత ప్రజలు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చాపర లో నున్న ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు.





## అభివృద్ధికి నోచని..
# తిలారు రైల్వేస్టేషన్

**- ప్రయాణికులకు నిలువనీడ కరువు.. ఎండా, వానలో ఇబ్బందులు**

**- కనీస వసతులు లేక తీవ్ర అసౌకర్యం**

**- మరుగుదొడ్లు, షెడ్ల ఏర్పాటు చేయాలని ప్రయాణికుల డిమాండ్**

**జలుమూరు, ఆగస్టు 25 (వార్త):** తిలారు రైల్వే స్టేషన్ కనీస అభివృద్ధికి నోచుకోకపోవడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన ప్రాథమిక వసతులు లేకపోవడంతో రోజూ అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. రైలు కోసం ఎదురుచూసే ప్రయాణికులకు సరైన షెడ్లు, నిలువనీడ కల్పించే వసతి లేకపోవడంతో మండుటెండలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షం కురిసే సమయంలో తడవకుండా ఉండేందుకు కూడా సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా స్టేషన్ పరిధిలో కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారు, రైళ్ల కోసం ఎక్కువ సమయం వేచి ఉండే వారు ఈ సమస్యతో మరింత ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రయాణికులకు సేవలందిస్తున్న తిలారు రైల్వే స్టేషన్‌లో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం పట్ల స్థానికులు, ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే షెడ్లు, మరుగుదొడ్లు, తాగునీటి వంటి కనీస సదుపాయాలను ఏర్పాటు చేసి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని రైల్వే శాఖ అధికారులను కోరుతున్నారు.



# మున్సిపల్ చైర్మన్ రేసులో బడగల

**- పలాస కాశీబుగ్గలో మాస్ లీడర్ గా గుర్తింపు**

**-డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ప్రధాన అనుచరుడుగా ముద్ర**

**- బలమైన కాళింగ సామాజిక వర్గం అండ**

**- అన్ని వర్గాల్లో మంచి పట్టున్న వ్యక్తి**

**- టికెట్ రేసులో ముందంజలో ఉన్నట్టు సమాచారం**



**పలాస, ఆగస్టు 25 (వార్త):** మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పలాస రాజకీయ వర్గాల్లో చైర్మన్ పదవిపై ఆశావా హులు సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నట్లు జోరు గా చర్చ కొనసాగుతుంది. ఇప్పటికే పలువురు నాయకులు తమ రాజకీయ పావులు కదుపుతున్న వేళ తాజాగా వైసీపీకి చెందిన మరో సీనియర్ నాయ కుడు పేరు తెరపైకి వచ్చినట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అప్పయ్య దొర అనుచరుడుగా రాజకీయ గుర్తింపు పొందిన పలుమార్లు కౌన్సిలర్లుగా పనిచేసిన అనుభవం ఉన్న నాయకుడు మున్సిపల్ చైర్మన్ పదవిపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. పార్టీకి తనకున్న అనుబంధం స్థానికంగా ఉన్న పరిచయాలు ప్రజలతో ఉన్న సంబంధాలను తనకు అనుకూలంగా మలుచు కొని చైర్మన్ రేసులో నిలిచేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. మున్సిప ల్ ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో అభ్యర్థులు ఎంపికపై కసరత్తు ప్రారంభమవుతున్న తరుణంలో చైర్మన్ పదవి ఎవరిని వర్తిస్తుందని అంశం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా వైసీపీలో ఇప్పటికే పలువురు ఆశావాహులు ఉన్నట్లు ప్రచారం సాగుతుండగా తాజాగా బడగల బాలచంద్రుడు నాయకుడి పేరు చర్చికి రావడంలో పార్టీలో రాజకీ య సమీకరణలకు మరింత ప్రాధాన్యత సంతరించు కుంది. పలుమార్లు కౌన్సిలర్లుగా పనిచేసిన అనుభ వం స్థానిక రాజకీయాలపై అవగాహన సీనియర్ నేతలతో ఉన్న సంబంధాలు తనకు కలిసి వస్తుందని బల్లయ్య భావిస్తున్నారు. చైర్మన్ పదవికి చివరకు పార్టీ అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుందనేది మాత్రం వేచి చూడాల్సిందేనని రాజకీయ వర్గాలు అభిప్రా యం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే పలువురు నాయకులు తమ అనుచరులు, కౌన్సిలర్ అభ్యర్థులతో సమాలోచనలు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ నాటికి మరికొందరు ఆశావాహులు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా మున్సిపల్ చైర్మన్ పదవిని కేంద్రంగా చేసుకొని వైసిపిలో అంతర్గత రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయని చర్చ జరుగుతుంది. రానున్న రోజుల్లో ఎవరు బలం ఎంత? ఎవరు వీనికి ఎంతమంది కౌన్సిలర్లు నిలుస్తారు? పార్టీ నాయకత్వం ఎవరి అండగా నిలుస్తుంది? అన్న అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగా సౌమ్యుడు ప్రజా సేవకుడు పేరుగాంచిన బల్లయ్యను చైర్మన్ పదవికి వైసిపి అభ్యర్థిత్వం ప్రకటిస్తే గెలుపు సునాయాసంగా ఉంటుందని రాజకీయ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546